
సాక్షి
మెదక్
ఆదివారం । 26 । నవంబర్ । 2023



బీజేపీ, కాంగ్రెస్‌లవి ఝూటా..
ఝూటా మాటలతో మోసం చేయడానికి వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతల తీరును ఎండగట్టాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. వివరాలు 6లో ▸



బాధ్యతాయుతంగా మెలగాలి
ఎన్‌సీసీ కాడెట్లు సమాజంలో బాధ్యతాయుతంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలని గజ్వేల్ ఏసీపీ రమేష్ సూచించారు. వివరాలు 6లో ▸



బీటీ రోడ్డు వేయరూ..
రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డును బాగు చేయండని ప్రజాప్రతినిధులను, అధికారులను అడిగినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 7లో ▸

న్యూస్‌రీల్

లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం

సీనియర్ సివిల్ జడ్జి జితేందర్



కౌడిపల్లి: సదస్సులో మాట్లాడుతున్న జడ్జి

కౌడిపల్లి(నర్సాపూర్): లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని మెదక్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ జితేందర్ తెలిపారు. శనివారం కౌడిపల్లి మండలం తునికి వద్దగల డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణ అభివృద్ధి విద్యాసంస్థ, వ్యవసాయ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ అగ్రికల్చరల్ లెజిస్లేషన్స్, ఫార్మర్ వెల్ఫేర్ స్కీమ్స్‌తో పాటు విద్యార్థుల స్వేచ్ఛ, అభివృద్ధికి రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు. లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు పొందవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌వీజే డైరెక్టర్ అర్జునరావు, స్టాఫ్ జగదీశ్, ప్రీతి, విద్యార్థులు, వృద్ధులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌లు సన్నద్ధం

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా



ఏంపీఓ, కార్యదర్శులతో మాట్లాడుతున్న సాయిబాబా

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, అన్ని వసతులతో పోలింగ్ స్టేషన్‌లను సన్నద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని చిలప్‌చెడ్‌తో పాటు, చిట్కుల్, చండూర్ గ్రామాలలో గల పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాట్లు పరిశీలించామని చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రమేశ్, కార్యదర్శులు తిరుపతి, కృష్ణ, జితేందర్ పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ



విద్యార్థులకు కంప్యూటర్ గురించి వివరిస్తున్న నోడల్ అధికారి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ సూచించారు. చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్ జాబ్ ట్రైనింగ్ గురించి అవగాహన కల్పించారు. కంప్యూటర్ సాయంలో జరుగుతున్న కార్యకలాపాలను వివరించారు. ఎలా ఉపాధిని పొందాలో సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు, లెక్చరర్‌లు లక్ష్మణ్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రచారాలు.. ప్రలోభాలు

- నోట్ల పంపిణీ ప్రారంభం?
- ఒకరిని మించి మరొకరు పోటీ
- ప్రత్యర్థులపై ఫిర్యాదులు
- ముగ్గురు అధికారులపై వేటు



మెదక్: ఎన్నికలకు ఇంకా నాలుగు రోజుల గడువు మాత్రమే ఉంది. ఎన్నికలకు 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపి వేయాల్సి ఉండడంతో ఇక ప్రచారానికి కేవలం రెండు రోజుల సమయం మాత్రమే ఉంది. దీంతో ఓటర్లను తమవైపు మలుపుకునేందుకు అభ్యర్థులు పైరవీలు ప్రారంభించారు. ఒక వైపు ముమ్మరంగా ప్రచారం చేస్తూనే మరోవైపు నోట్ల పంపకం ప్రారంభించి నట్లు తెలుస్తోంది. ముందుగా వారి ప్రత్యర్థులు ఇచ్చే వరకు వేచిచూస్తున్న అభ్యర్థులు తాము ఎంత ఇవ్వాలనే అంశంపై లెక్కల వేసుకుంటున్నట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీకైనా సహకరిస్తే వెంటనే సీ విజిల్ ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయి.

నగదు పంపిణీ?

జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని మండలాలు, గ్రామాల్లో ఓట్లు తమకే వేస్తారనే నమ్మకం ఉన్న ఓటర్లకు డబ్బుల పంపిణీ మొదలు పెట్టినట్లు సమాచారం. ఒక్కో ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి. ఓటుకు ఎంత ముట్ట చెప్పాలని లెక్కలు వేసి సీక్రెట్‌గా పంచుతున్నారు. ఓటుకు నోటు తీసుకున్న వారి నుంచి తమకే ఓటు వేయాలంటూ ఒట్లు కూడా వేయించుకుంటున్నట్లు తెలిసింది. అయితే తటస్తులకు ఎంత ఇవ్వాలి, ఇవ్వకపోతే నష్టం ఏ మేరకు ఉంటుందనే అంశంపైనా కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఎన్ని ఓట్లు ఉన్నాయి, గతంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి? అనే దిశగా ఆయా పార్టీల నేతలు లెక్కలు వేసుకుంటున్నట్టు సమాచారం.

గతంలో తమ పార్టీకి ఏ గ్రామాల్లో మెజార్టీ వచ్చింది. ఎంత డబ్బు పంపిణీ చేశారు? ఇప్పుడు ఎంత మేరకు చేయాలి? పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఏ మేరకు పంపిణీ చేయాలనే దానిపై అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. ప్రత్యర్థి ఒక్క ఓటుకు ఎంత ఇచ్చారనేది తెలియగానే అంతకు మించి ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఓ అభ్యర్థి ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తుంటే.. మరో అభ్యర్థి ఓటుకు రూ.2 వేలు చొప్పున పంపిణీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు చర్చ సాగుతోంది. అలాగే స్వతంత్ర అభ్యర్థుల తరపున ఓటర్లు ఉంటే వారికి కూడా డబ్బు పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో 50 శాతానికి పైగా ఓటర్లకు నగదు పంపిణీ చేయాలని కొంత మంది అభ్యర్థులు నిర్ణయించుకుని ఆ దిశగా తమ కేడర్‌తో పంపిణీ బాట పట్టించారు. తమకు ఓట్లు పోల్ కావని భావించిన ప్రాంతాల్లో మాత్రం కొంత మందికే పంపిణీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

ప్రత్యర్థులపై ప్రత్యేక దృష్టి

మరోవైపు అభ్యర్థులు తమ ప్రత్యర్థుల కదలికపై ప్రత్యేక నిఘా పెట్టారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారా? ఏ మేరకు నగదు పంపిణీ చేస్తున్నారనే అంశంపై ఆరా తీయిస్తున్నారు. పోలింగ్‌కు ఇంకా 4 రోజులే సమయమే ఉండడంతో ఇప్పటి వరకు ప్రచారం పైనే దృష్టి సారించిన అభ్యర్థులు ఇప్పుడు డబ్బు పంపిణీ మొదలుపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం చేస్తూనే మరో వైపు డబ్బు పంపిణీపై కూడా పర్యవేక్షిస్తున్నారు. అయితే కార్యకర్తలు, తమ ప్రత్యర్థులు ఎక్కడెక్కడ పంపిణీ చేస్తున్నారనే దానిపై ఓ కన్నేసి, సమాచారం తెలియగానే అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది.

ముగ్గురు అధికారులపై వేటు

ఎన్నికల నియామవళికి విరుద్ధంగా పని చేస్తున్నారని ముగ్గురు క్షేత్రస్థాయి అధికారులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. చేగుంట మండలం చందాయిపేటకు చెందిన వీఓఏ పద్మ, హవేళీఘణాపూర్ మండలం నాగాపూర్‌కు చెందిన వీఓఏలు ఒక పార్టీకి ప్రచారం చేస్తున్నారని సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు అందుకున్న అధికారులు వారిని విధుల నుంచి తొలగించారు. అలాగే పాపన్నపేట మండలం కొత్తపల్లిలోని వార్డెన్ సైతం ఓ పార్టీ కండువా కప్పుకుని ప్రచారం చేస్తున్నారనే ఫిర్యాదుతో ఆయనను కూడా విధుల నుంచి సస్పెండ్ చేశారు.

రిమోట్ కంట్రోల్ డ్రోన్‌ల నిషేధం

జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా



మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని తూప్రాన్–నర్సాపూర్ మార్గంలో గల బ్రాహ్మణ పల్లి గ్రామంలో ఆదివారం ప్రధాని మోదీ బహిరంగ సభ నేపథ్యంలో రిమోట్ కంట్రోల్ డ్రోన్‌లు నిషేధిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా శనివారం తెలిపారు.

1430 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాల్లో శనివారం 1430 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయినట్లు రాజర్షిషా తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 241 మంది, మెదక్ డిగ్రీ కళాశాలలో 411 మంది, ఆర్డీఓ కార్యాలయంలో 133, నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో 155, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 490, మొత్తం 14 30 మంది ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసినట్లు తెలిపారు. అలాగే 23, 24 తేదీల్లో నిర్వహించిన హోమ్ ఓటింగ్‌లో 1429 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. వయో వృద్ధులు, అత్యవసర సేవల సిబ్బంది 648 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

మెదక్: జిల్లాలోని ఎన్నికల విధులలో ఉన్న ప్రతి ఉద్యోగి విధిగా తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా సూచించారు. టీఎన్‌జీవో భవన్‌లో శనివారం కర్మచారి కల్యాణ్ మిషన్ పేరుతో నిర్వహించిన ఉద్యోగుల ఓటుహక్కు అవగాహన, సంక్షేమ సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఫార్మ్ 12 అప్లైచేసి పోస్టల్ బ్యాలెట్లు రాని వారు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులు శత శాతం ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఏదైనా ఇబ్బంది తలెత్తితే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, సంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు జావిద్ అలీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, బాధ్యులు మనోహర్, ఫణి రాజ్, ఎండి ఇక్బాల్ పాషా, ఫజలుద్దీన్, సంయుక్త కార్యదర్శులు పోతురాజు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

3421 కొత్త ఎపిక్ కార్డుల పంపిణీ

- పాత్రికేయులకు అథారిటీ లెటర్లు
- పార్టీలన్నీ ఎన్నికలకు సహకరించాలి

మెదక్ కలెక్టరేట్: ఎన్నికలలో భాగంగా ఈసీఐ నిబంధనల ప్రకారం బీఎల్ఓల ద్వారా జిల్లాలో 3421 కొత్త ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడ్రస్ మార్పు, రీప్లేస్‌మెంట్ వంటి వాటికి, కొత్తగా నమోదు చేసుకున్న వారికి కొత్త ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. అభ్యర్థికి మూడు వాహనాలు మాత్రమే అనుమతి ఉంటుందని, 75 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వాహనాలు వద్దు

పోలింగ్ రోజు ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చేందుకు రాజకీయ పార్టీలు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయకూడదని కలెక్టర్ తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ రోజు పాత్రికేయులకు ఎన్నికల అథారిటీ లెటర్లు అందజేస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారం కవరేజ్ చేసుకోవాలని కోరారు. తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్.. కామారెడ్డికి ఎందుకు వెళ్లావ్?

కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి

తూప్రాన్: గజ్వేల్ విడిచి కామారెడ్డికి ఎందుకు వేళ్లాల్సి వచ్చిందో సీఎం కేసీఆర్ ఇప్పటికీ వరకూ చెప్పలేని పరిస్థితో ఉన్నారని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. శనివారం తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే గజ్వేల్‌కు అనేక పరిశ్రమలు వచ్చాయని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఎన్ని పరిశ్రమలు తీసుకు వచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గజ్వేల్‌లో గెలిచినా, ఓడినా అందుబాటులో ఉండరని ఎద్దేవా చేశారు. తాను స్థానికుడినని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రజలు ఆశీర్వదించి కాంగ్రెస్‌కు ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాంగ్రెస్ మున్సిపల్ పట్టణశాఖ అధ్యక్షుడు రవీందర్‌గుప్తా, యూత్ అధ్యక్షుడు నాగరాజుగౌడ్, సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, విశ్వరాజ్, సిద్దిరాములుగౌడ్, ఉమర్, అనిల్, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్, కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఓటమి ఖాయమైందన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, యాదగిరి తాటి విఠల్, కొప్పెర ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్: ఎన్నికల ప్రచారంలో జిల్లాలో జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీని ముఖ్యమంత్రిని చేయాలనే ఏకైక పార్టీ బీజేపీనే అని, తమ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ కులానికి చెందిన వ్యక్తి సీఎం అవుతారని పేర్కొన్నారు. అనంతరం మెదక్ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, నందారెడ్డి, ప్రసాద్, విజయ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

గజ్వేల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ కారణంగా వాహనాలను దారి మళ్లించామని, ప్రజలు గమనించాలని తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి శనివారం తెలిపారు. తూప్రాన్ నుంచి నర్సాపూర్ వైపు వెళ్ళే వాహనదారులు వెల్దుర్తి మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. అలాగే సభాస్థలికి వచ్చే కార్యకర్తలు, అభిమానులు అగ్ని ప్రమాదానికి దారితీసే ఏ వస్తువులు అలాగే వాటర్ పాకెట్లు, బాటిల్స్, బ్యాగులు సభకు తీసుకొని రావద్దని విజ్ఞప్తి చేశారు.

చాకరిమెట్లకు కార్తీక శోభ



సమూహిక వ్రతాలు ఆచరిస్తున్న దంపతులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకశోభ సంతరించుకుంది. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఉసిరి వనంలో మహిళలు దీపాలు వెలిగించారు. దాతల సహాయంతో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ స్థాపకుడు, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ సార శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం లేదు టీచర్ల ఆవేదన

నర్సాపూర్: నర్సాపూర్‌లో పోస్టల్ బ్యాలెట్ అందరికీ ఇవ్వడం లేదని పలువురు ఉపాధ్యాయులు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. అయితే వారికి రెండు రోజులుగా ఎన్నికల విధుల నిర్వహణ కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శిక్షణ ఇచ్చారు. శనివారం శిక్షణకు వచ్చిన టీచర్లు తమకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని ఎన్నికల అధికారులను అడగ్గా కొందరికి బ్యాలెట్ రాలేదని చెప్పడంతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులను వివరణ కోరగా కొందరికి బ్యాలెట్ రానందున ఓటు వేసే అవకాశం కల్పించలేదని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఈ నెల 29 వరకు ఓటువేసే అవకాశం ఉందని చెప్పారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చామని శ్రీనివాసులు తెలిపారు.

ఉత్తమ బోధన అందించాలి

సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న రాజీవ్

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజీవ్‌మిశ్రా ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గోమారం ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠ్య ప్రణాళిక ప్రకారం విద్యా బోధన పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ అధికారి సుదర్శనమూర్తి, ఎంఈఓ బుచ్చనాయక్ తదితరులు ఉన్నారు.

ప్రతి సబ్జెక్ట్‌పై పట్టు సాధించాలి

నర్సాపూర్ రూరల్: ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టులో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సర్వ శిక్ష అభియాన్ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ సూచించారు. శనివారం నర్సాపూర్ మండలం జక్కపల్లిలోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఉన్నతి కార్యక్రమం అమలు తీరును, విద్యార్థులను ప్రతిభను పరిశీలించారు. మెరుగైన విద్య కోసం చేపట్టవలసిన చర్యలపై ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరా హోరీ..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :

ఎన్నికల ప్రచారం తారా స్థాయికి చేరింది. ప్రచారానికి గడువు కేవలం 48 గంటల్లో ముగుస్తుండటంతో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. అభ్యర్థులు రోడ్‌షోలతో ఊరూరు తిరుగుతూనే ఇంటింటి ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల అనుచరులు తమ నేతను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. 30న పోలింగ్ జరగనుంది. దీంతో పోలింగ్‌కు రెండు రోజుల ముందే అభ్యర్థులు ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుంది. 28తో ప్రచారానికి గడువు ముగుస్తుంది. దీంతో కేవలం 48 గంటలే మిగిలి ఉండటంతో వీలైనంత ఎక్కువ మంది ఓటర్లను కలిసే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఇప్పటికే కొందరు అభ్యర్థులు నియోజకవర్గాన్ని ఒకటికి రెండు సార్లు చుట్టి వచ్చారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అభ్యర్థులు నియోజకవర్గం అంతా కలియదిరిగారు. అభ్యర్థిత్వాల ఖరారులో జాప్యం జరిగిన కారణంగా కాంగ్రెస్ ప్రచారంలో కాస్తా

తారాస్థాయిలో ప్రచార పర్వం

- వేగంపెంచిన అభ్యర్థులు
- ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నం

అలస్యంగా ప్రారంభించింది. బీజేపీ పలు చోట్ల మొక్కుబడిగా ప్రచారం నిర్వహిస్తోంది. అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ

ఇంటింటి ప్రచారం చేస్తూనే అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నారు. కుల సంఘాలు, వివిధ సామాజికవర్గాల నేతలతో సమావేశమవుతున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాల ద్వారా గంపగుత్తాగా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయా సామాజికవర్గాలకు ఇప్పటి వరకు అందించిన సహకారం, గెలిపిస్తే మరింత అందిస్తామని వివరిస్తూ మద్దతు కూడగడుతున్నారు. ఆ దిశగా ఆ వర్గాల నేతలను మచ్చిక చేసుకుంటున్నారు. ఆత్మీయ సమ్మేళనాల ద్వారా వీలైనంత ఎక్కువ ఓట్లు రాబట్టుకోవచ్చని భావిస్తున్నారు.



కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కారుకు వేసినట్లే

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



అమిత్ షాకు స్వాగతం పలుకుతున్న బీజేపీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసినట్టే అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. శనివారం సాయంత్రం పటాన్‌చెరు మార్కెట్ యార్డ్‌లో బీజేపీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభకు ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు బీఆర్ఎస్‌లోకి వెళ్లారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామన్నారు. దేశంలో రెండున్నర కోట్ల ఉద్యోగాలు ఇస్తే ఒక్క పేపర్ కూడా లీక్ కాలేదని, తెలంగాణలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల నోట్లో కేసీఆర్ మట్టి కొట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. పటాన్‌చెరు ప్రజలు రెండు సార్లు ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కటి నందీశ్వర్ గౌడ్‌కు వేసి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, మరో ఓటు రానున్న ఎంపీ ఎన్నికల్లో నరేంద్ర మోదీకి వేయాలన్నారు. కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి ప్రభు చవాన్, జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేశ్, గోదావరి అంజిరెడ్డి, రవీందర్, అంజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఆశిష్ గౌడ్, నరేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాడెట్లు బాధ్యతాయుతంగా సేవ చేయాలి

గజ్వేల్ ఏసీపీ రమేష్



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీ కాడెట్లు సమాజంలో బాధ్యతాయుతంగా ఉంటూ ప్రజలకు సేవ లందించాలని గజ్వేల్ ఏసీపీ రమేష్ సూచించారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 75వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్‌సీసీ యూనిఫాం అనేది గౌరవప్రదమైనదని, సమాజంలో ప్రజలకు సేవలందించేందుకు ఈ యూనిఫాం బాధ్యతను పెంచుతుందన్నారు. విద్యార్థులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అధ్యాపకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవాని ఈ సంవత్సరం ఎన్‌సీసీ విభాగంలో రాష్ట్ర, జాతీయ శిబిరాలైన ఆర్మీ అటాచ్‌మెంట్, స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్, ఇంటర్ బెటాలియన్, మౌంటెనీరింగ్ శిబిరాలకు హాజరైన కాడెట్ల వివరాలను, ఎన్‌సీసీ–బీ,సీ సర్టిఫికెట్ పరీక్షల ఫలితాలను వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు బాల్‌రాజు, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, డాక్టర్ పెద్దిరాజు పాల్గొన్నారు.

శనీశ్వరునికి తైలాభిషేకం


తైలాభిషేక పూజలో భక్తులు

వర్గల్(గజ్వేల్): శని త్రయోదశి పర్వదిన వేడుకలతో వర్గల్ శ్రీవిద్యాసరస్వతి శనీశ్వర క్షేత్రం అలరారింది. శనివారం తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు త్రయోదశి పర్వదిన వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 6 గంటల నుంచి భక్తుల సామూహిక తైలాభిషేక పూజలు కొనసాగాయి. ప్రధాన మండపంలో అర్చకులు వారితో శాస్త్రోక్తంగా శనీశ్వర పూజ జరిపించారు. అనంతరం శనీశ్వరుని మూలవిరాట్టుకు తిల తైలం సమర్పించారు. 710 తైలాభిషేకాలు జరిగినట్లు ఆలయవర్గాలు తెలిపారు.

ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు కట్టబెడుతుందని ఆరోపించారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి వారిపై భారం మోపుతుందన్నారు. దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై మతపరమైన ఆంక్షలు విధిస్తూ దాడులను చేస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సందబోయిన ఎల్లయ్య, నాయకులు రవి, రంగారెడ్డి, అహ్మద్, బండ్ల స్వామి, వేణుగోపాల్, బాలకృష్ణారెడ్డి, బాల్‌లక్ష్మి, వెంకటాచారి, కనకచారి, మహాలక్ష్మి, కనకవ్వ, స్వామి, నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వృత్తిని పక్కనబెట్టి.. ఎన్నికల బరిలో

- అసెంబ్లీ ఎన్నికల బరిలో వైద్యులు, న్యాయవాదులు
- ప్రధాన పార్టీల నుంచి పోటీ
- భవితవ్యం తేల్చుకోవడానికి సిద్ధమైన అభ్యర్థులు


చంద్రశేఖర్, డాక్టర్


సంజీవరెడ్డి, డాక్టర్


రోహిత్‌రావు, డాక్టర్


బాపురెడ్డి, న్యాయవాది



సంగారెడ్డి: ప్రజల నాడి పట్టి వైద్యం చేసే డాక్టర్లు రాజకీయాలపై ఉన్న ఆసక్తితో అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగారు. ఈసారి ఓటర్ల పల్స్ పసిగట్టి విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 102 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అందులో ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు వైద్యులు ఎన్నికల బరిలో నిల్చున్నారు. మెదక్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి డాక్టర్ సంజీవరెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గంలో డాక్టర్ చంద్రశేఖర్ రావు ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ ముగ్గురు వైద్యులు అయినప్పటికీ రాజకీయాల్లో తమ భవితవ్యం తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు.

నల్లకోర్టును వదిలి..

ఉమ్మడి మెదక్ జిల్లాలో కొందరు న్యాయవాదులు సైతం అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్నారు. తమ వృత్తిని వదిలి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లో వచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రముఖ న్యాయవాదిగా పేరొందిన పోసానిపల్లి బాపురెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అలాగే చిరు వ్యాపారులు , యువకులు , విద్యావంతులు ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నారు .

గుర్తుతో పాటు ఫొటో ప్రదర్శన

గత ఎన్నికల్లో మాదిరిగా కాకుండా ఈ ఎన్నికల్లో ఈవీఎంలపై అభ్యర్థి గుర్తుతో పాటు ఫొటోను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రదర్శిస్తుంది. దీంతో కొందరు ఓటర్లు గుర్తుల విషయంలో అయోమయానికి గురికాకుండా అభ్యర్థి ఫొటో చూసి కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు.

బీజేపీ, కాంగ్రెస్‌లవి ఝూటా మాటలు


అహ్మదీపూర్‌లో ప్రసంగిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ఝూటా మాటలతో మోసం చేయడానికి వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతల తీరును ఎండగట్టాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ మండలం కొల్గూర్, అహ్మదీపూర్, శేర్‌పల్లి, దిలాల్‌పూర్, ధర్మారెడ్డిపల్లి, రంగంపేట, మక్తమాసాన్‌పల్లి, కోమటిబండ, రిమ్మనగూడ గ్రామాల్లో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే భూములను గుంజుకుంటారని ఆ రెండు పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని అన్నారు. అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములను పట్టాగా మార్చడానికి కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కొద్దిపాటి సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరించడానికి కార్యాచరణ సిద్ధమైందన్నారు. కార్యక్రమాల్లో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, అమరావతి, మల్లేశం, బెండె మధు పాల్గొన్నారు. కాగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్లు, మర్పడగ చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.


రోడ్ షోలో పాల్గొన్న జనం

కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారు

మనోహరాబాద్(తూప్రాన్): సంక్షేమ పథకాలు, గజ్వేల్‌లో చేసిన అభివృద్ధితో కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ సాధిస్తారని ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన జీడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకులు మోర భాస్కర్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రేఖమల్లేష్, మహిపాల్‌రెడ్డి, సాయికుమార్, కుంటరాజు తదితరులున్నారు.

కేసీఆర్‌కే మా మద్దతు


దేవేందర్‌రెడ్డికి తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

కొండపాక(గజ్వేల్): సీఎం కేసీఆర్‌కే మా ఓటంటూ కొండపాక ముదిరాజ్ సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శనివారం డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డికి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్, బీజేపీలు మోసం చేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరామని సంఘం అధ్యక్షుడు చంద్రం పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టి మాధురీరెడ్డి, మాజీ ఎంపీపీ కనకయ్య, నాయకులు రామకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్, యాదగిరి, అంజద్, తదితరులు పాల్గొన్నారు.



బీడీలు చుడుతాం.. హామీలు నెరవేర్చుతాం

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని మల్లాయపల్లిలో బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ ఇంటి వద్ద బీడీలు చుట్టి.. కమలం గుర్తుకు ఓటేస్తే కష్టాలు తీరుతాయని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, బాలేష్ గౌడ్, రవి పాల్గొన్నారు. –దుబ్బాక



అవ్వా.. కారును 'గుర్తు'పెట్టుకో..

మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్ ఓ ఇంటి సమీపంలో కూర్చున్న అవ్వ దగ్గరికి వెళ్లి ఈవీయంపై ఉన్న కారు గుర్తు చూపించి ఓటేయాలని కోరారు. –చిలప్‌చెడ్(నర్సాపూర్)



నీ కష్టంలో పాలుపంచుకుంటా..

మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత సిద్దిపేట పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. ఈ సందర్భంగా ఓ ఇంటి వద్ద బీడీలు చుడుతున్న మహిళను ఆప్యాయంగా పలకరించారు. శ్రీనిత కూడా ఓ బీడీ చుట్టి అందరినీ ఆకట్టుకున్నారు. –సిద్దిపేటజోన్



అన్నా.. ఇదిగో కారు.. వేసెయ్ ఓటు

గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని శనివారం వర్గల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొమ్మ కారును చూపిస్తూ ఓటేయాలని అభ్యర్థించారు. – వర్గల్(గజ్వేల్)

కేసీఆర్ పాలనలో అంతా అవినీతే..


హత్నూరలో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి జరగలేదని, అంతా అవినీతిమయం చేశారని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన హత్నూర మండలం రొయ్యపల్లి, షేర్ఖాన్ పల్లి, నాగారం, కొడిపాక, కొత్తగూడెం, చింతల్ చెరు, కోనంపేట, వడ్డేపల్లి, తదితర గ్రామాలలో రాజిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క గ్రామం కానీ.. బడుగు బలహీన వర్గాల వారెవరూ అభివృద్ధి చెందలేదన్నారు. కేసీఆర్ మాటలకు రెండుసార్లు ప్రజలు మోసపోయారని, మూడోసారి అందుకు సిద్ధంగా లేరన్నారు. ఎన్నికలు కాంగ్రెస్ విజయం ఖాయమని, బీఆర్‌ఎస్ పార్టీకి భంగపాటు తప్పదన్నారు. ఇందిరమ్మ రాజ్యంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి హకీం, మాజీ జెడ్పీటీసీ జయశ్రీ, నర్సాపూర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కృష్ణ, నాయకులు వెంకటేశం, కృష్ణ, మణిదీప్, భాస్కర్ పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలు కోరుకుంటున్న ఇందిరమ్మ రాజ్యం ఏర్పడుతుందని రామాయంపేట మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆ పార్టీ నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా మండల కేంద్రం కొల్చారం చిన్నఘణపూర్, సంగాయిపేట, రంగంపేట గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లేశం గౌడ్, మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.


రంగంపేటలో ప్రచారం చేస్తున్న విఠల్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సలాబత్‌పూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని గెలిపించాలని మండల ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అంతారం సర్పంచ్ అశోక్‌గౌడ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కర్ణాకర్‌రెడ్డి, సుదర్శన్, నవీన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): ఆవుల రాజిరెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ దొంతి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పానగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో రాజిరారెడ్డితో పాటు ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా దేవాలయ ప్రతిష్ఠోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతి మహాస్వామి, గురుమధనానంద సరస్వతీ పీఠాధిపతులు మధనానంద సరస్వతి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, అష్టాదశ శక్తిపీఠ రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపును అడ్డుకోలేరు

ఆ పార్టీ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): అసత్య ప్రచారాలతో బీఆర్‌ఎస్ గెలుపును అడ్డుకోలేరని ఆ పార్టీ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండలంలోని అల్లాపూర్, రాయికోడ్, పీపడ్‌పల్లి, మహ్మదాపూర్, ధర్మాపూర్, యూసుఫ్‌పూర్, సంగాపూర్, సింగితం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బసవరాజ్ పాటిల్, సిద్ధప్ప పాటిల్, విఠల్, శంకర్, తుకారామ్, బస్వరాజ్, హన్మంత్‌రావు, సంగయ్య స్వామి, అనిల్‌కుమార్, మారుతి, సంగమేశ్వర్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.


రాయికోడ్ : క్రాంతికిరణ్‌పై పూలవర్షం కురిపించిన కార్యకర్తలు

ప్రతిపక్షాలకు డిపాజిట్లు గల్లంతే

మునిపల్లి(అందోల్): అందోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా రావని యువత పార్టీ రాష్ట్ర నాయకులు సాయికుమార్ జోష్యం చెప్పారు. శుక్రవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో జెడ్పీటీసీ మీనాక్షి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గులాబీ పార్టీలో చేరారు. అనంతరం బీఆర్‌ఎస్ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. కార్యక్రమంలో నరేష్, ఫరుక్‌పటేల్, సుభాష్, మౌలాన, జగదీశ్వర్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

జోగిపేట (అందోల్): బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఉదయ్ భాస్కర్ అన్నారు. అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌కు మద్దతుగా ఆయన జోగిపేటలోని పలు వార్డులలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఖాజా పాషా, మైతాఫ్ ఖలీల్, గోరె భాయ్, వాజిద్, ఇమ్రాన్, అన్వర్, సలీం ఫహీం, అమీర్ పాల్గొన్నారు


ఖమ్మంపల్లిలో పార్టీలో చేరిన వారికి కండువ కప్పుతున్న సాయికుమార్

భారీ మెజార్టీతో హ్యాట్రిక్ సాధిస్తా..

నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధిస్తానని నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని దేవునిపల్లి, మహదేవుపల్లి, ఇందిరానగర్, ఫత్తేపూర్, పోమ్యానాయక్ తండా, మార్డి తండా, నిజాంపేట మండలం ఖానాపూర్(బి), కల్వనికుంట తండాలో మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ దిలీప్‌కుమార్, సర్పంచ్ సులోచన, నాయకులు నారాయణరావు, జనార్దన్‌రెడ్డి, గణపతినాయక్, సాయిగొండ, బాబ్యానాయక్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డికి మద్దతుగా మండలంలో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు జంగం రాఘవులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్నయ్య, ఆసూరి వంశీ, దేవేందర్ పాల్గొన్నారు.


కల్హేర్: దేవునిపల్లిలో బాణం ఎక్కుపెట్టిన భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి

పెద్దశంకరంపేట(మెదక్): తనను మూడో సారి ఆశీర్వదించి గెలిపిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డితో కలిసి పెద్దశంకరంపేటలో మైనార్టీలతో, మల్కాపూర్, గొట్టిముక్కుల, ఆరేపల్లి, బద్దారం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, జంగం శ్రీనివాస్, విజయ రామరాజు, మురళి తదితరులున్నారు.


పెద్దశంకరంపేటలో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం